
సాక్షి పల్నాడు

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అయ్యప్పలకు సద్ది ముగింపు

బాపట్ల : సోమేశ్వరస్వామి గుడిలో అయ్యప్పలకు సద్ది ముగింపు సందర్భంగా మంగళవారం పూర్ణాహుతి నిర్వహించినట్లు గురుస్వామి కొటికం సుబ్బారావు తెలిపారు.



లక్ష్మీగణపతి మహాయాగం

పెదకాకాని: మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో లక్ష్మీ గణపతి మహాయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. 15వ తేదీన ప్రారంభమైన యాగం బుధవారంతో ముగియనుంది.

ట్యాబు.. దొరబాబు

- వరుసగా రెండో ఏడాదీ పంపిణీకి సర్కారు చర్యలు
- ఈ ఏడాది 18,169 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు
- ఉద్యోగోన్నతి పొందిన 345 మంది గురువులకూ..
- మెమరీ 256 జీబీకి పెంపు
- 8తోపాటు 9,10, ఇంటర్ సిలబస్ అందుబాటులోకి..
- రేపు పాఠశాలల్లో పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



ట్యాబ్ ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థి(ఫైల్)

సాక్షి, నరసరావుపేట: పేద విద్యార్థులూ దొరబాబుల్లా ఇంగ్లిష్ చదువుతోపాటు డిజిటల్ విద్యను అందిపుచ్చుకోవాలనే సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు చేపట్టారు. దీనిలోభాగంగా గతేడాది ఎనిమిదో తరగతి విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఇప్పుడు వరుసగా రెండో ఏడాదీ పంపిణీకి చర్యలు చేపట్టారు. డిసెంబర్ 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయనున్నారు. దీనికోసం ఇప్పటికే మండల కేంద్రాలకు ట్యాబ్‌లు చేరుకున్నాయి.

18,514 మందికి ట్యాబ్‌లు..

2023–24 విద్యా సంవత్సరంలో పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో 8వ తరగతి విద్యార్థులు సీఎస్ఈ ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం 18,169 మంది ఉన్నారు. మరోవైపు కొత్తగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారు సుమారు 345 మంది ఉన్నారు. వీరందరికీ ఈ ఏడాది ట్యాబ్‌లు అందనున్నాయి. గతేడాది 2,348 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఇవ్వడంతో వారికి ఈ ఏడాది ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అలాగే గతేడాది 8వ తరగతి చదువుతున్న 21,820 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గతేడాది 64 జీబీ మెమరీ గల ట్యాబ్‌లు ఇవ్వగా ఈ ఏడాది వాటి స్థానంలో 256 జీబీ మెమరీగల ట్యాబ్‌లను అందజేయనున్నారు. వీటి వల్ల మరిన్ని అప్లికేషన్స్, సిలబస్ స్టోర్ చేయడానికి వీలవుతోంది. గతేడాది ఇచ్చిన ట్యాబ్‌లలో 8, 9వ తరగతి వరకే ఈ–కంటెంట్ ఉండగా, ఈ ఏడాది ఇచ్చేవాటిలో అదనంగా టెన్త్ ఇంటర్మీడియట్ సిలబస్ స్టోర్ చేసి ఉండటం విశేషం. విద్యార్థుల సందేహాల నివృత్తికి ఏఐ ట్యూటర్ అనే ప్రత్యేక యాప్‌నూ ట్యాబ్‌లలో ప్రీలోడ్ చేశారు.



సత్తెనపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్ ఫోటోలు)

పచ్చపత్రికల విషం

పేదింటి పిల్లలకు మారుతున్న సమాజానికి అనుగుణంగా డిజిటల్ విద్య అందుబాటులో ఉండాలన్న జగనన్న సదుద్దేశంపై పచ్చపత్రికలు విషం కక్కుతున్నాయి. అబాంఢాలు వేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. విద్యార్థులు ట్యాబ్‌లు దుర్వినియోగం చేస్తున్నారంటూ రాద్ధాంతం చేస్తున్నాయి. అయితే విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. డీఈఓ మొదలు ఉపాధ్యాయుల వరకు నిరంతరం విద్యార్థులు ఆ ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నారు అన్నది తెలుసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా కనీసం ఒకసారి ప్రతి పాఠశాలనూ సందర్శించి ట్యాబ్‌ల పనితీరును తనిఖీ చేస్తున్నారు. ట్యాబ్‌లకు ఏదైనా మరమ్మతులు అవసరమైతే డిజిటల్ అసిస్టెంట్‌లే బాధ్యత తీసుకొని చేయిస్తున్నారు. ప్రతి శుక్రవారం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విద్యార్థి, ఉపాధ్యాయుల ట్యాబ్‌లకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ట్యాబ్‌లు ఎంతమేర సద్వినియోగం అవుతున్నాయో ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నారు.



మాచర్ల మండల కేంద్రంలో విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్యాబ్‌లు

పేద విద్యార్థులకు డిజిటల్ విద్య..



పేదింటి విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందిస్తోంది. గతేడాది జిల్లాలో 24,168 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేసింది. గురువారం మరో 18,514 మందికి ట్యాబ్‌లను అందించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ పూర్తి చేసింది.

– శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్

పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి



బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల వల్ల పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. ఫొటోలు, వీడియోల రూపంలో చూడటంతో విషయాలను మరింత లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులు లేని సమయంలో ఇంట్లోనే ఉంటూ చదువుకుంటున్నాం.

– అరిగెల ఆర్య వెంకట్, 9వ తరగతి విద్యార్థి, ఏపీ మోడల్ స్కూల్, దుర్గి

న్యూస్‌రీల్

తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ బదిలీ



నూతన సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలిరూరల్: తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మంగళవారం రాత్రి బదిలీ అయ్యారు. ఆమె గ్రామ, వార్డు సచివాలయ అడిషనల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐఏఎస్ అధికారి ప్రఖర్‌జైన్‌ను తెనాలి సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రఖర్ జైన్ తన ప్రాథమిక విద్యను ఎస్‌డీఏస్ కాన్వెంట్ స్కూల్ లలిత్‌పూర్ నుంచి పూర్తి చేశారు. మధ్యప్రదేశ్‌లోని విదిసాలోని న్యూజైన్ హయ్యర్ సెకండరీ స్కూల్ నుంచి 12వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. 2016లో కాన్పూర్ ఐఐటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

సామాజిక బస్సుయాత్ర 30వ తేదీకి మార్పు

తాడికొండ: తాడికొండలో ఈ నెల 23వ తేదీన నిర్వహించాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర 30వ తేదీకి మార్చడం జరిగిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ మార్పును గమనించాలని వారు సూచించారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కమిటీ నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ పల్నాడు జిల్లా యువజన విభాగ కమిటీలో నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షునిగా పడాల సాంబశివారెడ్డి(నరసరావుపేట), ఉపాధ్యక్షులుగా డి.శ్రీనివాసరెడ్డి (మాచర్ల), యు.శ్రీను (గురజాల), ప్రధాన కార్యదర్శులుగా ఎ.వెంకటరామిరెడ్డి (పెదకూరపాడు), కె.చిన్నబాబు (నరసరావుపేట), ఎల్.అంజిరెడ్డి (వినుకొండ), డి.కృష్ణారెడ్డి (చిలకలూరిపేట), ఐ.వెంకటరామిరెడ్డి (గురజాల), కె.అంజిరెడ్డి (మాచర్ల), కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, ఎస్.రాము (పెదకూరపాడు), వి.రాంబాబుయాదవ్, షేక్ జాన్‌సైదా (నరసరావుపేట) నియమితులయ్యారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

గుంటూరు జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్ : పేదలకు అందజేసే బియ్యంలోగానీ, నిత్యావసర సరుకుల్లోగానీ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఇటీవల 4,083 క్వింటాళ్ల అక్రమ బియ్యాన్ని సీజ్ చేశారు. దీనికి సంబంధించి మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదలకు కనీస ఆహారం అందించాలని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి ఉచిత బియ్యాన్ని అందిస్తున్నాయన్నారు. వీటిని కూడా కొందరు అక్రమ మార్గంలో సంపాదించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని చెప్పారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

యార్డుకు 59,428 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 59,428 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 57,412 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి రూ.23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 25,598 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

శాంతా బయోటెక్ ఎండీకి ఏఎన్‌యూ ప్రతిభా పురస్కారం



కె.ఐ.వరప్రసాద్ రెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ(గుంటూరు): శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశిష్ట ప్రతిభా పురస్కారం ప్రదానం చేసింది. వర్సిటీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత ప్రసంగిస్తూ శాంతా బయోటెక్ ద్వారా అనేక రకాల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరోనాకు ఔషధాలను తమ సంస్థలో తయారు చేసి ప్రపంచానికి అందించామని పేర్కొన్నారు. ప్రస్తుత యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నూతన ఆవిష్కరణలతోనే రాణింపు సాధ్యమవుతుందని చెప్పారు. ఉన్నత ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు యువత కృషి చేయాలని సూచించారు. వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఔషధాల తయారీతో భారతదేశానికి శాంతా బయోటెక్ పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టిందని తెలిపారు. ఈ సంస్థను ఆదర్శంగా తీసుకుని సమాజ హితానికి దోహదం చేసే నూతన ఆవిష్కరణలు జరగాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓఎస్డీ కె.సునీత, ప్రిన్సిపాల్స్ కె.గంగాధర రావు, పి.సిద్దయ్య, ఇ.శ్రీనివాసరెడ్డి, ఎ. ప్రమీలారాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎస్సీ, ఎస్టీ చట్టం పకడ్బందీగా అమలు చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు, సభ్యులు

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేద్దామని, చట్టం దుర్వినియోగం కాకుండా చర్యలు చేపడదామని కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హాలులో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. చట్టానికి సంబంధించి గత మూడేళ్లలో జిల్లాలో ఏయే ప్రాంతాల్లో కేసులు ఎక్కువ నమోదవుతున్నాయో ఆ ప్రాంతాలను మ్యాప్ చేసి అక్కడ ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. దీనికోసం రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సమష్టిగా కృషిచేయాలన్నారు. ప్రతి నెలా నాలుగో శనివారం ఆర్డీవో, డీఎస్పీ పోలీస్‌స్టేషన్ ఆఫీసర్ కలిసి మండల స్థాయిలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులకు అత్యాచార నిరోధక చట్టంపై మంగళగిరి ఏపీహెచ్ ఆర్‌డీలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి, కలెక్టర్ కార్యాలయంలోని సీ–విభాగపు పర్యవేక్షకులను ఆదేశించారు. కోటప్పకొండలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులను ఎస్సీలకు కూడా కేటాయించాలని డీవీఎంసీ సభ్యురాలి కోరికపై ఎండోమెంట్ సహాయ కమిషనర్‌తో మాట్లాడి నివేదిక సమర్పించాలని ఆర్డీఓ ఎం.శేషిరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. రెంటచింతల పొలం విషయంలో సభ్యుడు మరియదాసు ప్రశ్నపై డీఎస్పీ స్పందిస్తూ రిపోర్టు సిద్ధంగా ఉందని, ఇంకా లోతుగా అధ్యయనం చేసి ఇవ్వాలని ఎస్పీ కోరిన మీదట అతి త్వరలో నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఎస్సీలు అధికంగా ఉన్న నాదెండ్ల మండలం ఎండుగంపాలెంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఓబులనాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా రెవెన్యూ అధికారులు, ఆయా డీఎస్పీలు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం



ఆరోగ్యశ్రీ కార్డులు ప్రదర్శిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.25 లక్షలకు పెంపు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

సత్తెనపల్లి: పేదల పాలిట సంజీవనిగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని మరో నాలుగు రెట్లు పెంచి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం నూతన వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గతంలో కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్సకు చెల్లించేవారన్నారు. అయితే ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ.25 లక్షలకు పెంచారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు ఎటువంటి సందేహాలు రాకుండా ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం 13, 14 వార్డులకు కలిపి 13వ సచివాలయం పరిధిలో 696 ఆరోగ్యశ్రీ కార్డులు రాగా వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎంజేఆర్ రామ లింగారెడ్డి, అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణలకు పక్కా ఏర్పాట్లు



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు తదితరులు

దుర్గగుడి ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్ష విరమణలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్ టౌన్ పోలీసు అధికారులతో ఈవో రామారావు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో జరిగిన సమావేశంలో గత ఏడాది భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానం చేసిన ఏర్పాట్లు, లోటుపాట్ల గురించి ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు ఈవో రామారావు దృష్టికి తీసుకెళ్లారు. జనవరి 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే దీక్ష విరమణలకు పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులకు విచ్చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా 6వ తేదీ సాయంత్రం నుంచి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఈవో రామారావు సూచించారు.

క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన..

భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని దేవస్థానం భక్తులకు కల్పించే సదుపాయాలను క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించారు. కొండపై, వినాయకుడి గుడి వద్ద క్యూలైన్లు, కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశం, ఇరుముడి పాయింట్లు, హోమగుండాలు, ప్రసాదం కౌంటర్లు, అన్నదానం, టాయిలెట్స్ ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. దీక్ష విరమణలు ప్రారంభమ్యే రెండు, మూడు రోజులకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు వాటిని తనిఖీ చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణం క్యూలైన్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం కన్వెన్షన్ ట్రెస్‌వర్క్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): స్థానిక స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనంలో కన్వెన్షన్ హాల్ ట్రెస్‌వర్క్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులకు మునిసిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేపీసీ డైరెక్టర్ పి.వాసుదేవరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. జనవరి 20, 2024 కల్లా స్మృతివనం పనులు పూర్తవుతాయని తెలిపారు. అంబేడ్కర్ స్మృతివనాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, జాతికి అంకితం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీటీఓ మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారి(సీటీఓ) మృతి చెందిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన కె.భవాని(49) నరసరావుపేట కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో సీటీవోగా పనిచేస్తున్నారు. తిరుపతితో పాటు ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లి, మంగళవారం తిరిగి గుంటూరు వచ్చారు. పట్టాభిపురం ఓవర్ బ్రిడ్జి ఎక్కి టీజేపీఎస్ కళాశాల వద్దకు రాగానే కారు డ్రైవర్ రాంగ్‌రూటులో వెళ్లే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆమె తలకు గాయం కాగా ఆస్పత్రికి తీసుకుని వెళ్ళే సరికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఓటు నమోదుపై అవగాహన తప్పనిసరి

పల్నాడు జిల్లా ఎన్నికల ప్రక్రియ జిల్లా పరిశీలకులు శ్రీధర్



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు శ్రీధర్, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: యువ, భావి ఓటర్లకు ఓటు నమోదు గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎన్నికల ప్రక్రియ జిల్లా పరిశీలకులు బి.శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్పందన హాలులో ఓటరు నమోదుపై జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. పరిశీలకులు మాట్లాడుతూ వచ్చే జనవరి ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ప్రతి ఒక్కరిని నూతన ఓటరుగా గుర్తించడం జరుగుతుందని వెల్లడించారు. ఓటు నమోదుపై ఫారం –6, ఎలా భర్తీ చేశారు అడిగి తెలుసుకున్నారు, అలాగే ఫారం –7 మరణించిన ఓటును ఎలా తొలగించారు అడిగి తెలుసుకున్నారు. ఫారం–8 కింద పేరులలో, చేర్పుల మార్పులలో పదో తరగతి సర్టిఫికెట్ అర్హతగా గుర్తించి క్షుణ్ణంగా పరిశీలించి, పంచనామా నిర్వహించి ఓటు తొలగించాలని తెలిపారు. ఎక్కడ బలవంతంగా ఓట్లు తొలగించరాదని బీఎల్‌వోలను ఆదేశించారు. చనిపోయిన, నియోజకవర్గాన్ని విడిచిపెట్టిన వ్యక్తులకు సంబంధించిన ఎంట్రీలను క్షుణ్ణంగా పరిశీలించి ఓట్లను తొలగించాలని తెలిపారు. పేర్ల చేర్పడం, అభ్యంతరాలు క్లెయిములను జాగ్రత్తగా పరిశీలించి తొలగించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రైతుల పక్షపాత ప్రభుత్వమిది

మంత్రి అంబటి రాంబాబు


లంకెలకూరపాడులో సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): రైతు శ్రేయస్సే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఎల్లప్పుడూ రైతుకు అండగా ఉంటామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాల పంపిణీని మంగళవారం ప్రారంభించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునే చర్యలలో భాగంగా 80శాతం రాయితీపై వ్యవసాయశాఖ ద్వారా విత్తనాలు అందించటం జరుగుతుందన్నారు. ఆ మేర వ్యవసాయశాఖ సిబ్బంది పంపిణీ చేపట్టారన్నారు. క్వింటా ధర రూ.8,100 కాగా సబ్సిడీ పోను రైతుకు రూ.1,620లకు అందించటం జరుగుతుందన్నారు. అవసరమైన రైతులు వ్యవసాయశాఖ ద్వారా తీసుకోవచ్చన్నారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు కూడా రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబురావు, సర్పంచ్ మోర్తాల వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజీఎం రామలింగారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, కిక్కురు రామిరెడ్డి, ప్రభాకరరెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, ఎంపీడీవో పుట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగురాళ్ల పట్టణంలో విజిలెన్స్ దాడులు

పిడుగురాళ్ల: పట్టణంలో వివిధ జనరల్ స్టోర్స్‌పై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణంలో అక్రమంగా అనుమతులు లేని(ట్యాక్స్ చెల్లించబడిన) నిషేధించిన, ఆరోగ్యానికి హానికరమైన సిగరేట్లు అమ్ముతున్నారని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వివిధ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా ఎన్‌డీపీజీ(నాన్ డ్యూటీ పెయిడ్ గూడ్స్) సిగరెట్లు అమ్ముతున్న వారిని గుర్తించారు. గోల్డ్ విమల్ బ్రాండ్ 43, గోల్డ్ స్టెఫ్ బ్రాండ్ 21, గోల్డ్ స్టెఫ్ పెద్దవి 5, పారిస్ బ్రాండ్ బిగ్ 3 మిత్తం 83 ఔటర్ బాక్సెప్ విలువ రూ.1,06,000 విలువ ఉంటుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు. చట్టం 2003 సెక్షన 20(2) క్రింద పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వీఆర్వోను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.శ్రీనివాసులురెడ్డి, స్థానిక అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

భర్త మృతి చెందిన మరుసటి రోజే భార్య మృతి



క్రోసూరు: మరణంలోనూ వీడని బంధం వారిద్దరిది. భర్త మృతి చెందిన మరుసటి రోజే తనువు చాలించిన భార్య. ఈ సంఘటన క్రోసూరు ఎస్సీకాలనీలో చోటుచేసుకున్నది. చిల్కా దాసు(69), లీలావతి భార్యాభర్తలు. లీలావతి 2014–19 సంవత్సరంలో క్రోసూరు సర్పంచ్‌గా పనిచేసింది. దాసు (69) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమం పూర్తి చేసుకుని ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి లీలావతి(65) మృతి చెందింది. వీరికి వివాహితులైన ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. క్రోసూరు గ్రామ ప్రజలకు సర్పంచ్‌గా సుపరిచితురాలు. మాజీ సర్పంచ్ లీలావతి, ఆమె భర్త ఒకేసారి మృతి చెందటంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పలువురు గ్రామస్తులు దాసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సమష్టి కృషితో క్రీడాకారులుగా రాణించాలి

- రేమాండ్స్ అధినేత టి.అరుణ్‌కుమార్
- ముగిసిన ఏఎన్‌యూ మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్


కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అరుణ్‌కుమార్, కేవీ బ్రహ్మం, మనోహర్

గుంటూరుఎడ్యుకేషన్: సమష్టి కృషితో క్రీడాకారులుగా రాణించాలని రేమాండ్స్ అధినేత టి.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఇంటర్నెట్, మొబైల్, ఫేస్‌బుక్‌తో సమయం వృథా చేయకుండా క్రీడాసక్తిని పెంచుకుని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఇటువంటి పోటీలను అవకాశాలుగా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. తద్వారా నాయకత్వ, అభివ్యక్తి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. 35వ డివిజన్ అధ్యక్షుడు టీఎల్‌వీ వీరాంజనేయులు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓడినంత మాత్రాన అధైర్య పడకుండా మరలా కష్టపడి గెలవాలని చెప్పారు. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. గుంటూరులోని హిందూ కళాశాల ద్వితీయ, కందుకూరులోని టీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల తృతీయ, చోడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు నాలుగో స్థానంలో నిలిచారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, కోశాధికారి కృష్ణానంద్, నంబూరు శంకరరావు, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి శివాజీ, ఏఎన్‌యూ వాలీబాల్ సెలక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ మెమోరియల్ క్లబ్ జట్టు విజయం

నరసరావుపేట: స్థానిక ఎస్‌కెఆర్‌బీఆర్ ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఫుల్ మెంబర్ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రెసిడెంట్ కప్‌లో భాగంగా మంగళవారం గుంటూరు గాంధీ మెమోరియల్ క్లబ్, ఏలూరు బ్లాక్ షర్ట్స్ క్రికెట్ క్లబ్ జట్ల మధ్య ఒన్‌డే మ్యాచ్ నిర్వహించారు. గాంధీ మెమోరియల్ క్లబ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన బ్లాక్ షర్ట్స్ జట్టు 37.1 ఓవర్లలో 121పరుగులకు ఆల్ అవుట్ అయ్యారు. బ్లాక్ షర్ట్స్ క్రికెట్ క్లబ్‌లోని సాయి లక్ష్మణ్ 21పరుగులు చేయగా, గాంధీ మెమోరియల్ క్లబ్‌లోని భాను చైతన్య మూడు వికెట్లు, పరంధామ్ రెండు వికెట్లుసాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గాంధీ మెమోరియల్ క్లబ్ 31.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయానికి కావల్సిన 122 పరుగులు చేశారు. గాంధీ మెమోరియల్ క్లబ్‌లోని భానుచంద్ యాదవ్ 53పరుగులు చేయగా బ్లాక్ షర్ట్స్ క్రికెట్ క్లబ్‌లోని సాయి రామచరణ్ రెండు వికెట్లు సాధించారు. ఏసీఏ ఫుల్ మెంబర్ క్లబ్ టోర్నమెంట్ ఈనెల 25 వరకు నిర్వహించబడుతుందని టోర్నమెంట్ పరిశీలకులు ఎ.శ్రీనివాస్ తెలిపారు.

నెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు..


ఎంపికైన విద్యార్థులు రామారావు, చరణ్‌తేజ్

చిలకలూరిపేట: జాతీయస్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఏఎంజీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడలోని మేరీస్టెల్లా డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులు కుంచపు రామారావు, తమ్మిశెట్టి చరణ్‌తేజ్ పాల్గొని ప్రతిభ కనపరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థులు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలలో పాల్గొంటారు. మంగళవారం ఏఎంజీ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ అభినందించారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు శ్రీలక్ష్మి ఎంపిక..


ప్రథమ బహుమతి సాధించిన శ్రీలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ

నరసరావుపేటరూరల్: జేఎన్‌టీయూఎన్ అంతర కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో నరసరావు పేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థిని కె.శ్రీలక్ష్మి ప్రథమ బహుమతిని సాధించి నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరికృష్ణ మంగళవారం తెలిపారు. సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూఎన్ అంతర కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో కళాశాల ఈసీఈ నాలుగో ఏడాది విద్యార్థిని శ్రీలక్ష్మి పాల్గొని లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమబహుమతి సాధించినట్లు వివరించారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీలక్ష్మి ఎంపికైనట్లు వివరించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఇద్దరి ఎంపిక


జగదీష్‌ను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి సుబ్బరాయ

నరసరావుపేటరూరల్: రాష్ట్రస్థాయి జూనియర్స్(అండర్–17) స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఏడు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. ఏపీ సబ్ జూనియర్, జూనియర్ అంతర జిల్లాల శీతాకాలం అక్వాటిక్(స్విమ్మింగ్) చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 16, 17 తేదీలలో ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.జగదీష్ 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, బటర్‌ఫ్లై ఈవెంట్స్‌లో, 200 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో బంగారు పతకాలు, వంద మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో రజిత పతకం సాధించాడు. జూనియర్ ఇంటర్ విద్యార్థి వై.మధుకుమార్ 50 మీటర్లు, బటర్‌ఫ్లై ఈవెంట్స్‌లో రజిత పతకం, వంద మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. ఇద్దరు బెంగళూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కె.విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య అభినందించారు.

'లఘు ఉద్యోగ భారతి' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తులసి యోగిష్

కొరిటెపాడు(గుంటూరు): సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభ్యున్నతి , సేవలకై కేంద్ర స్థాయిలో 1995లో ఏర్పాటైన 'లఘు ఉద్యోగ భారతి' రాష్ట్ర స్థాయిలో తమ సేవలను విస్తృత పరిచే కార్యక్రమంలో భాగంగా స్థానిక అరండల్‌పేటలోని యోగి భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి లఘు ఉద్యోగ భారతి ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జ్, నేషనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.అనంత్ అధ్యక్షత వహించారు. లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర ప్రెసిడెంట్ మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తులసి యోగిష్ లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. యోగిష్ మాట్లాడుతూ తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. లఘు ఉద్యోగ భారతి ద్వారా లఘు పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలోని ఆయా శాఖల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సంస్థలు దేశాభివృద్ధికి వెన్నెముక వంటివని, ఈ చిన్న తరహా పరిశ్రమలు ఎంతగా అభివృద్ధి చెందితే యువతకు అంతగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

కారంపూడి ఎస్ఐ దురుసుగా ప్రవర్తించలేదు

డీఎస్పీ పల్లపురాజు


మాట్లాడుతున్న డీఎస్పీ పల్లపురాజు

గురజాల: కారంపూడి తిరునాళ్ల చివరి రోజు కారంపూడి ఎస్ఐ ఓ వృద్ధుడిని కొట్టినట్లు వచ్చిన ఆరోపణలను డీఎస్పీ పల్లపురాజు తీవ్రంగా ఖండించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ కొన్ని చానల్స్‌లో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. పాస్‌ల వద్ద జరిగిన కొట్లాటలో వృద్ధుడు అనారోగ్యంగా ఉండడం వల్ల కిందపడ్డాడని అంతేకాని పోలీసులు ఎవరూ వృద్ధుడి వద్దకు వెళ్లిన దాఖలాలు లేవన్నారు. జెయింట్‌వీల్ వద్ద చిన్నపాటి గొడవ జరుగుతుందన్న విషయం నిర్వాహకుడు కుమార్ వద్ద నుంచి ఎస్ఐకి ఫోన్ వస్తే ఆ ప్రాంతానికి వెళ్లి గొడవ జరగకుండా ఎస్ఐ సర్దుబాటు చేశారన్నారు. నిర్వాహకులు 250 పాస్‌లు ఇస్తే సుమారుగా 3వేల పాస్‌లు దొంగవి వచ్చినట్లు నిర్వాహకులు గుర్తించి రంగులరాట్నం తిరగకుండా నిలుపుదల చేయడం జరిగిందని ఆ విషయంలో గొడవ జరిగిందే తప్ప పోలీసులకు ఎటువంటి సంబంధం లేదన్నారు. పోలీసులు ప్రతి ఒక్కరితో ఫ్రెండ్లీ పోలీసింగ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కారంపూడి సీఐ దార్ల జయకుమార్ తదితరులున్నారు.

అ'పూర్వ' విద్యార్థుల జూబ్లీ మీట్



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎస్ఎస్ఎన్ కళాశాలలో 1970–73 బీఏ డిగ్రీ చదివిన విద్యార్థులు

నరసరావుపేట: యాభై ఏళ్ల కిందట ఒకేచోట డిగ్రీ చదివిన విద్యార్థులు కలిసి జూబ్లీ మీట్ నిర్వహించారు. వీరిలో మాజీ జడ్జీలు, రిటైర్డు ప్రిన్సిపాల్స్, ప్రభుత్వాధికారులు, అధ్యాపకులు, న్యాయవాదులతోపాటు పలు రంగాల్లో విశిష్ట సేవలు అందజేసిన వారు ఉండటం విశేషం. స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ (ఎస్ఎస్ఎన్) కళాశాలలో 1970–73లో బీఏ డిగ్రీ చదివిన విద్యార్థినీ విద్యార్థులు మంగళవారం కళాశాలలో కలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ 70ఏళ్లకు పైబడిన వారే ఉండటం గమనార్హం. ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకొని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. తమ కుటుంబాలు, పిల్లలు, మనవళ్లు, మనవరాళ్ల గురించి చెప్పుకున్నారు. తమ పరిస్థితి ఏవిధంగా ఉందో ఒకరినొకరు పంచుకున్నారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన రిటైర్డు అధ్యాపకులైన ఎంఆర్‌కే మూర్తి, శివధర్మశాస్త్రి, లైబ్రేరియన్, సీనియర్ జర్నలిస్టు కేవీకే రామారావుతో మాట్లాడి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సమావేశమైన వారిలో రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తి శేషశయనారెడ్డి, రిటైర్డు జిల్లా జడ్జి ఇస్మాయిల్, రిటైర్డు అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో ఉన్న యన్నం బాలసరస్వతి, మధుసూదనరెడ్డి, ముప్పవరపు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

క్రైస్తవం మతం కాదు జీవన విధానం



గ్రాండ్ క్రిస్మస్ వేడుకలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, డాక్టర్ జోయ్ పి.మధు, డాక్టర్ జెస్సీవీణ

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా

గుంటూరు ఎడ్యుకేషన్: క్రైస్తవం మతం కాదు జీవన విధానమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా పేర్కొన్నారు. జెడ్పీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ సంయుక్తంగా మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో 16వ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి లవ్ ఆఫ్ జీసస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ జోయ్ పి.మధు, రెవరెండ్ డాక్టర్ జెస్సీవీణ క్రిస్మస్ సందేశమిచ్చారు. అనంతరం హెనీక్రిస్టినా కేకు కోశారు. ఏ వ్యక్తి అయితే అవధులు లేని ప్రేమను చూపిస్తూ ప్రతీకారం, ఈర్ష్య, అసూయ, ద్వేషం వంటివి మరచిపోతాడో అతడే నిజమైన క్రైస్తవుడని, మనలోని ఆత్మీయ తృష్ణ చల్లారేంత వరకు, క్రీస్తు మన హృదయంలో జన్మించేంత వరకూ మనం ఆయన కోసం ఎదురు చూడాలని అన్నారు. ఎప్పుడైతే ఆయన మన హృదయాల్లో జన్మించడం వలన నిజమైన శాంతి నెలకొంటుందో, అప్పుడు జనులకు వేరే సాక్ష్యాలు అవసరం లేదన్నారు. అది మన జీవితాల ద్వారా ప్రతిబింబిస్తుందని, కేవలం వ్యక్తిగతంగానే కాకుండా సామాజికంగా మార్పు కనపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, న్యూటన్ నెమలికంటి, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.